రైతులకు ధాన్యం టోకెన్ల పంపిణీ

చిల్లేపల్లి వద్ద ధాన్యం ట్రాక్టర్లకు టోకెన్లు ఇస్తున్న సీఐ చరమందరాజు

నేరేడుచర్ల, నవంబర్ 14 : వరి ధాన్యాన్ని మిర్యాలగూడలోని రైస్ మిల్లులో విక్రయించడం కోసం మండలంలోని చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద రైతులకు గురువారం టోకెన్లు పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగాలని, మద్దతు చెల్లించాలని ఇటీవల రైతులు ధర్నా చేయడంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల అధికారులు రైతులు పండించిన ధాన్యాన్ని టోకెన్ల ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ మిల్లులకు వచ్చే ధాన్యం ట్రాక్టర్లకు ఉదయం 9:30 నుంచి రాత్రి 10 గంటల వరకు చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద టోకెన్‌లు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జావిద్ మాట్లాడుతూ పూర్తిగా గింజ ఏర్పడిన తర్వాత, తాలు ఇతర చెత్త లేకుండా శుభ్రంగా ధాన్యం తీసుకొచ్చే రైతులకు మాత్రమే టోకెన్లు ఇస్తామన్నారు. టోకెన్ల పంపిణీ కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, తాసీల్దార్ సురగి సైదులు, ఎస్ఐ రవీందర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్ రెడ్డి, మత్స్యశాఖ సహకార సంఘం చైర్మన్ పేరబోయిన వీరయ్య, కౌన్సిలర్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ నేతలపై కేసులు

- తెలంగాణ వికాస సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌రావు

సూర్యాపేట అర్బన్/పెన్‌పహాడ్, నవంబర్ 14 : రాజకీయంగా ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరును రిమాండ్ రిపోర్టులో చేర్చడంతో పాటు, బీఆర్ఎస్ నాయకులు, రైతు నాయకులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలంగాణ వికాస సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బిట్టు నాగేశ్వర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు రైతు బంధు ఇవ్వలేని ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజలకు మరలించేందుకు అరెస్టుల పేరుతో డ్రామాలు మొదలు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే తగిన గుణపాఠం నేర్పుతారని పేర్కొన్నారు. గతంలో 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ రైతులకు అండగా ఉందని, ఇలాంటి చర్యలకు పాల్పడలేదని గుర్తు చేశారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లను అప్పగించాలి : బీఆర్ఎస్

లబ్ధిదారులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రామారావు

కోదాడ, నవంబర్ 14 : కోదాడ పట్టణ పరిధి బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని బీఆర్ఎస్ నాయకుడు మామిడి రామారావు అన్నారు. కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సూర్యనారాయణకు లబ్ధిదారులతో కలిసి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు.

48 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లింపులు పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తిరుమలగిరి : తాటిపాములలో ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ హరిప్రసాద్

చివ్వెంల, నవంబర్ 14 : మండల పరిధిలోని బీబీగూడెం, ఐలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. కేంద్రాల్లో ఉపయోగించే తేమ శాతం యంత్రాలు సిద్ధం చేసి ఉంచాలని అన్నారు. ఆయన వెంట తాసీల్దార్ సీహెచ్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీనివాస్, నిర్వాహకులు పాల్గొన్నారు.
తిరుమలగిరి : మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ హరిప్రసాద్ గురువారం పరిశీలించారు. ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సురేశ్ సందర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, ఏపీఎం మధు, సీసీ ఇద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

నేరేడుచర్ల పీఏసీఎస్ ఎదుట జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి

నేరేడుచర్ల, నవంబర్ 14 : సహకార సంఘం వారోత్సవాలను గురువారం నేరేడుచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి సహకార సంఘం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పీఏసీఎస్ డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, సురేశ్‌రెడ్డి, శంకరచారి, సత్యనారాయణ రెడ్డి, వెంకటరెడ్డి, పద్మ రాంరెడ్డి, జయమ్మ, సీఈవో శ్రీనివాస్, రామచంద్రా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలను నిర్వహించారు. సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ జెండాను ఎగురవేశారు. పీఏసీఎస్ డైరెక్టర్లు మంగళగిరి కృష్ణ, దాసరి నర్సమ్మ, బాల్తూరి అంజయ్య, నాయకులు సైదయ్య, ముత్తినేని సోమయ్య, చెనగాని మహేశ్, ముత్తినేని కోటేశ్వర్‌రావు, వెంకయ్య, పీఏసీఎస్ సీఈఓ కనకయ్య, అంజయ్య, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్, నవంబర్ 15 : మిల్లర్లు కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని, సాంబ మాసూరి, ఇతర రకాలను కొనుగోలు చేయడం లేదన్నారు. వెంటనే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, పల్లె వెంకట్‌రెడ్డి, ఎల్లావుల రాములు, దుగ్గి బ్రహ్మం, వాసుదేవ రావు, సైదులు, రమేశ్, రమణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : సీపీఎం

గరిడేపల్లి, నవంబర్ 14 : ఐకేపీ కేంద్రాలు ప్రారంభమై 20రోజులు అవుతున్నా ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెంలో గురువారం ఐకేపీ కేంద్రాన్ని సీపీఎం మండల బృందం ఆధ్వర్యంలో సందర్శించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుమ్మల సైదయ్య, యమగాని వెంకటేశ్వర్లు, యల్లావుల నారాయణ, మీసాల మట్టయ్య, రావిరాల శ్రీను తదితరులున్నారు.

29న సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

మఠంపల్లి : మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మఠంపల్లి, నవంబర్ 14 : జిల్లా కేంద్రంలో ఈ నెల 29న జరిగే సీపీఎం జిల్లా తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండు నాయక్ పిలుపునిచ్చారు. మఠంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, పొడిచెట్టి రాము, ఎం.రాజు, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.
నేరేడుచర్ల : సూర్యాపేటలో జరిగే సీపీఎం పార్టీ జిల్లా మూడో మహాసభల పోస్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు కొదమగుండ్ల నగేశ్, నీలా రాంమ్మూర్తి, హఫీజ్, శ్రీను, ఏసు పాల్గొన్నారు.
హుజూర్‌నగర్ రూరల్ : ఈ నెల 29 జరగనున్న సీపీఎం తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ అన్నారు. మండల కమిటీ సమావేశంలో గురువారం మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. వెంకట చంద్ర, లక్ష్మీ నరసమ్మ, ఖాసీం, భిక్షం, వీరస్వామి, వెంకటేశ్వర్లు, సైదయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పాఠకులకు మధ్యాహ్న భోజనం కల్పిస్తాం

- రూ.5లక్షలతో డిజిటలైజేషన్‌కు కృషి
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

కేంద్ర గ్రంథాలయంలో వట్టికోట ఆళ్వార్ స్వామి విగ్రహానికి పూలమాల వేసిన కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, ఎమ్మెల్యే పద్మావతి

సూర్యాపేట టౌన్, నవంబర్ 14 : సూర్యాపేట కేంద్ర గ్రంథాలయంలో పాఠకులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు రూ. 5లక్షలతో డిజిటలైజేషన్ చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం జిల్లా గ్రంథాలయంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతితో కలిసి గ్రంథాలయ పితామహుడు వట్టికోట ఆళ్వార్ స్వామి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఆర్‌డీఓతో చర్చించి స్థలాన్ని ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి తన తల్లిదండ్రుల పేర రూ. లక్ష, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ రూ. 10వేల చెక్కును అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె.నారాయణరెడ్డి, కౌన్సిలర్ కెక్కిరేణి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శైలేందర్, ఆలేటి మాణిక్యం, కీసర సంతోష్ రావు, నాగార్జున్‌రెడ్డి, ఇరిగి కోటేశ్వరి, ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంవీ రంగారావు, వి.శ్యాంసుందర్‌రెడ్డి, డి.లలితాదేవి, కె.విజయభాస్కర్, పి.సృజన, కె.శ్రీదర్ రెడ్డి, సర్వయ్య, శ్రీనివాస్, నిర్మల, లక్ష్మి, శివాణి, రిటైర్డ్ గ్రంథ పాలకుడు వెంకట్ తదితరులు ఉన్నారు.

నేడు యోగానందుడి ఆలయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు

అర్వపల్లి, నవంబర్ 14 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ దంపతులు గురువారం కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నాయకులు, కార్యకర్తలు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు సూర్యాపేట మార్కెట్‌లో యథావిధిగా ధాన్యం కొనుగోళ్లు

సూర్యాపేట టౌన్, నవంబర్ 14 : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ రైతుల శ్రేయస్సు దృష్ట్యా యథావిధిగా ధాన్యం కొనుగోళ్లు జరపనున్నట్లు మార్కెట్ సెక్రటరీ సంతోష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోకెన్ ఉన్న సరుకులను మాత్రమే మార్కెట్ యార్డులో తీసుకురావాలని, రాత్రి 12నుంచి ఉదయం 8గంటల వరకు మాత్రమే మార్కెట్‌లోకి ధాన్యం అనుమతిస్తామని పేర్కొన్నారు.

24న కరాటే అసోసియేషన్ల సమావేశం

సూర్యాపేట టౌన్, నవంబర్ 14 : సూర్యాపేట జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న సూర్యాపేట పట్టణంలోని జేకేఏడబ్ల్యూఎఫ్ ఇండియా స్టేట్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ అబ్జర్వర్‌లు వస్తున్నందున జిల్లాలో ఉన్న కరాటే మాస్టర్స్ సమావేశానికి హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9110363889 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంగన్ వాడీ కేంద్రానికి కుర్చీలు.. ఆట వస్తువుల అందజేత

హుజూర్‌నగర్, నవంబర్ 15 : హుజూర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి జూలకంటి చిన్న అప్పారావు తన సతీమణి భాగలక్ష్మి జ్ఞాపకార్థం రూ.5వేల విలువైన కుర్చీలు, ఆటవస్తువులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సోమమ్మ , అంగన్ వాడీ టీచర్ రజిని, సామాజిక కార్యకర్త రాము, కొండయ్య పాల్గొన్నారు.

చిన్నారి శాన్విక్కి ఓపెన్ ఐస్ సొసైటీ చేయూత

హుజూర్‌నగర్, నవంబర్ 15 : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన బడిశా వీరయ్య, మౌనిక దంపతుల చిన్న కుమార్తె న్యుమోనియా వ్యాధితో బాధపడుతుండగా పట్టణానికి చెందిన ఓపెన్ ఐస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధులు రాము, ప్రశాంత్ కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు.

చెట్టు కొమ్మ మీద పడి వ్యక్తి మృతి

కోదాడ రూరల్, నవంబర్14 : చెట్టు కొమ్మ మీద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి గణపవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కంపూడి కొండయ్య(52) గ్రామానికి చెందిన ఓ రైతు గొడ్ల చావిడిలోని చింత చెట్టు కొమ్మలు నరుకుతూ కింద పడిన చెట్టు కొమ్మల చింతకాయలు కోసుకునేందుకు దిగిన సమయంలో చెట్టుపై సగం నరికిన ఓ కొమ్మ విరిగి తలమీద పడి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు

గరిడేపల్లి, నవంబర్ 14 : గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రావెప్ శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు గురువారం మండలంలోని కీతవారిగూడెం లో రైతులను కలిసి అక్కడున్న వరిసాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన నాగేంద్ర బాబు రైతు పొలంలో కొనసాగుతున్న వరి కోతలో పాల్గొని వివిధ పరిస్థితులపై అవగాహన పొందారు. కొత్తగా అమలైన వరి కోత పద్ధతులను రైతులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చన, హర్షిణి, అనూష, రమ్యశ్రీ, జవాలి, వైజ్యోష్ణ తదితరులున్నారు.

ప్రజా నాయకులు జన నాల్కలపై నిలుస్తారు

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్

మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

కోదాడ, నవంబర్14 : ప్రజల కోసం పనిచేసే నాయకులను జనం ఎప్పుడూ మరిచిపోరని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు 84వ పుట్టిన రోజు సందర్భంగా కోదాడలో గురువారం ప్రముఖ కవి శ్రీరామకవచం వెంకటేశ్వర్లు రచించిన 'రాజ్య తంత్రము' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడి నుంచి ఎదిగిన చందర్‌రావు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మంత్రిప్రగడ భరతరావు, అందె సత్యం, రావెళ్ల సీతరామయ్య, పార సీతయ్య, సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, పయిడిమర్రి సత్యబాబు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అర్వపల్లి : బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి, నవంబర్ 14 : నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయనున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని తిమ్మాపురం నుంచి తుంగతుర్తి మండలం సంగెం వరకు 11 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. తిమ్మాపురం ఎక్స్ రోడ్డు నుంచి ఊరి లోపలి వరకు సెంట్రల్ లైటింగ్ వేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర నాయకులు సామ అభిషేక్‌రెడ్డి, బీరవోలు సోమిరెడ్డి, ఇందుర్తి వెంకట రెడ్డి, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వీరస్వామి, లక్ష్మాజీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులు విలువలతో కూడిన సమాచారం అందించాలి

తిరుమలగిరి : వ్యాపార ధోరణి కాకుండా జర్నలిస్టులు విలువలతో కూడిన వార్తా కథనాలు ప్రచురించి ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నూతన ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. తాసీల్దారు హరిప్రసాద్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి

- న్యాయమూర్తి పి.శ్రీవాణి

మాట్లాడుతున్న న్యాయమూర్తి పి.శ్రీవాణి

సూర్యాపేట లీగల్, నవంబర్ 14 : మంచి బాటలో పయనించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి పి.శ్రీవాణి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సూర్యాపేట ప్రబుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జీవితంలో కాలం ఎంతో విలువైందని, సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సుదర్శన్‌రెడ్డి, డి.మల్లయ్య, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కి అంద్రయ్య, న్యాయవాదులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధికి చికిత్స సులభం : హెచ్ఈఓ శ్రీనివాస్

పెన్‌పహాడ్, నవంబర్ 14 : క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని హెచ్ ఈఓ భూతరాజు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని లింగాల గ్రామంలో గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ క్యాంపును నిర్వహించి మాట్లాడారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉండి ఆకలి మందగించడం, బరువు తగ్గడం ఉంటే వ్యాధి లక్షలుగా గుర్తించవచ్చన్నారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ ధరావత్ రవీందర్, రాజు, ఏఎన్ఎంలు నసీమా, సుజాత, ఆశ కార్యకర్తలు సుజాత, కనకమ్మ, ఇందిర, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేసిన ఎస్సీ క్వారేషన్ ఈడీ

సూర్యాపేట టౌన్, నవంబర్ 14 : పట్టణంలోని 27, 28, 29, 40వ వార్డుల్లో సమగ్ర కుటుంబ సర్వే తీరును ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వేలో భాగంగా ఇంటి వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సర్వే విజయవంతానికి సహకరించాలన్నారు. ఆయన వెంట డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, నవీన్, పూర్ణ చంద్రారెడ్డి, వసుంధర, సైదులు, ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఈఈ మనోజ్ తదితరులు ఉన్నారు.
పెన్‌పహాడ్ : మండలంలోని సీతరాంపురంలో సమగ్ర కుటుంబ సర్వేను గురువారం ఆర్డీఓ వేణు మాధవరావు ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం సింగరెడ్డిపాలెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ ధరావత్ లాలునాయక్, సీఓ స్వరూప, చంద్రకళ, లలిత, శైలజ ఉన్నారు.

సర్వారం సింగిల్ విండో పాలకవర్గం రద్దు

గరిడేపల్లి, నవంబర్ 14 : మండలంలోని సర్వారం సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేస్తూ జిల్లా సహకార సంఘం అధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘంలో ఏడుగురు మెజార్టీ సభ్యులు రాజీనామాలు చేయడంతో ఈ నెల 6న జరుగాల్సిన సమావేశాన్ని రద్దు చేసినట్లు, సభ్యుల రాజీనామాలను ఆమోదించి సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రోజువారీ విధులను నిర్వహించడానికి టీసీఎస్ చట్టం 1964రూల్ 23 ఏ ఏ(5) ప్రకారం ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. సహకార సంఘం పాలకవర్గం రద్దు కావడంతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.కమల, నేరేడుచర్ల సహకార బ్యాంక్ మేనేజర్ సతీశ్‌కు అదనపు భాధ్యతల అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఇరుముడి మహోత్సవం

గరిడేపల్లి, నవంబర్ 14 : మండల కేంద్రంలోని శివాలయంలో గల లక్ష్మీనరసింహస్వామి పీఠం వద్ద దీక్షాస్వాములు మండల దీక్షను పూర్తిచేసుకుని గురువారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి ధరించి మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి తరలివెళ్లారు. కార్యక్రమంలో వేదమూర్తులు రెంటాల సతీశ్‌శర్మ, గురుస్వాములు ముత్యాలు, వీరస్వామి, దీక్షా స్వాములు , భక్తులు పాల్గొన్నారు.

న్యూమోనియాపై అవగాహన

నూతనకల్, నవంబర్ 14 : న్యూమోనియా లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారిని ఆశ్రితరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు న్యూమోనియా నివారణ వ్యాక్సిన్ ఆరు వారాలకు ఒక డోసు, 14 వారాలకు రెండో డోసు, 9 వ నెలకు మూడో డోసు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చరణ్‌నాయక్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

హుజూర్‌నగర్, నవంబర్ 15 : వివాహిత తప్పి పోయిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల బక్క మంతుల గూడెం గ్రామానికి చెందిన వల్లపు దాసు రేణుక (19) కు 10నెలల క్రితం వేప